# పాము పడగ నీడ

"ఏటే..ఏటయిందియ్యాల" అన్నాడు అరుగు మీద కూర్చుని బీడీ త్రాగుతున్న వెంకటయ్య.

బరువెక్కిన హృదయంతో వచ్చిన రత్తి కళ్ళు వత్తుకుంటూ అరుగు దగ్గరే నేల మీద కూర్చుంది.

"ఏటే.. మాటాడవ్.. ఏటయింది?" అన్నాడు వెంకటయ్య మళ్ళీ రెట్టిస్తూ.

"ఏటవుతుంది. పని దొరకనేదు మామా! ఎన్నిల్లో తిరిగినా. కాని ఒకమ్మా పనివ్వనేదు. రాజేసరమ్మగారింటో దొంగతనం..అన్నాయంగా నా మీద పడిన దగ్గర్నుంచీ నాకు పనివ్వటానికి అందరూ బయపడుతుండారు మామా!" తల వంచుకుని నెమ్మదిగా అన్నది రత్తి.

అదోరకంగా నవ్వాడు వెంకయ్య.

రత్తికళ్ళెత్తి వెంకటయ్య వేపు జాలిగా చూసింది.

ఆ కళ్ళల్లోని దైన్యం. అసహాయత గ్రహించే శక్తి వెంకటయ్యకు లేదు.

"మరి మన కియ్యాల కూడా కూడు నేదా!" ఎర్రబడుతున్న కళ్ళతో చూశాడు వెంకటయ్య.

రత్తి మాట్లాడలేదు. మాట్లాడలేకపోయింది. మూడు రోజుల క్రింతం త్రాగిన గంజినీళ్ళు ఆమెకు మాట్లాడటానికి సత్తువ నివ్వలేకపోయినయి. నీరసంగా చూసింది వెంకటయ్య వేపు.

వెంకటయ్య వికటంగా నవ్వాడు.."యింతూళ్ళో నీకు నిజంగా పని దొరకనేదా.. ఎందుకే అబద్దాలాడతావ్. కుంటోణ్ణిగందా, నే సంపాయించటం లేదనేగా నీ బాధ.. అందుకనే గదే పని దొరకదని సెబుతుండావ్!"

బెదురు కళ్ళతోచూసింది రత్తి - "అదికాదు మామా, నిజంగానే పన్దొరకనేదు. పొద్దుటాల నుంచీ ఏడ తిరిగినా, ఏ అమ్మా పనివ్వలా. తిరగటానికి కూడా యిక నాకు సత్తువ నేదు. నిజం మామా! అవిటోడివి - నిన్ను పన్జేయమంటానికి నాకు మనసెట్టా ఒప్పుతుదనుకుండావ్ మామా.. మన కర్మిట్టా కాలింది.. యియ్యాల పస్తే" నీరసంగా అంది

రత్తి.

వెంకటయ్య అన్నాడు - "నీకూ నాకూ ఫరవానేదే. దేవుడికి గంజినీళ్ళు మొన్ననంగా పోశావా - మళ్ళా అదు మంచినీల్లయినా ముట్టాడా? పాణాలు గుప్పెట్లో పెట్టుకుండాడు. జొరంతో ఎట్టా తొంగున్నాడో ప్రాణాలు కల్లల్లో పెట్టుకు పడుండాడుకాదుటే..."

రత్తి మళ్లీ కళ్ళ నీళ్ళు పెట్టుకుంది. దేవుడు అంటే రత్తి కొడుకు. మూడేళ్ళవాడు. పిల్లాడి కోసం ప్రాణాలివ్వటానికయినా సిద్ధపడుతుంది రత్తి.

వెంకటయ్య భార్య వేపు క్షణం పరీక్షగా చూశాడు.రత్తి కళ్ళల్లో వెలుగు లేకపోయినా అందం ఉంది. ఆకలితో కడుపు లోపలికి పీక్కుపోయినా, బుగ్గలు వాడిపోయినా, కష్టించే శరీరం కనుక ఆమెలో ఒక రకమైన బిగి వుంది.

"రత్తీ, నేనోటి సెబుతాను, సేత్తావా?" నెమ్మదిగా అన్నాడు వెంకటయ్య.

కళ్ళెత్తి చూసింది రత్తి.. భర్త వేపు.

గొంతు సవరించుకున్నాడు వెంకటయ్య.

"చౌదరిగారు నిన్పోపాలి వాల్లింటికి రమ్మన్నారె - కనపడిరాయే..." అన్నాడు మెల్లగా.

"నన్నా, ఎందుకు మావా?" అన్నది రత్తి, ఏమీ అర్థం కాక.

"డబ్బులిత్తా నన్నారులే. మనం పస్తులుంటున్నామని తెలిసి ఆ మారాజు గుండె కరిగిపోనాది.. ప్రొద్దుటేల్నే పిలిచి చెప్పిండు"

రత్తి ముఖం వికసించింది. వెంకటయ్య కళ్ళల్లోకి సూటిగా చూసింది.

"నిజమేనే రత్తీ, నాను అబద్దం సెప్పనేదు!" అన్నాడు వెంకటయ్య

రత్తి చటుక్కున లేచి, బయటకు నడవబోయింది.

"ఆగే సన్నాసీ - అట్టాగేనా పోవడం? సుబ్బికాడ్నించి దాని సీరా. కుసింత పోడరూ తెచ్చి లోపల పెట్టిన. ఆ సీర కట్టుకుని పోడర్ రాసుకుని పో" అన్నాడు వెంకటయ్య.

రత్తికి ఏమీ అర్థం కాలేదు.

"ఏటి మామా.. నువ్వనేది" అన్నది.

వెంకటయ్య వికారంగా నవ్వాడు.

"ఏం నేదే.. ఆరికి నీ మీద మనసయిందంట. ఒకపాలి ఎల్లొచ్చావంటే దాన్సిగదరగా నీకూ నాకూ కూడా దేవుడి రోగానికి మందు..మనకిక ఏ బాధా వుండదు.."

రత్తికి కళ్ళు తిరిగినంత పనయింది. తన మావ తాగుబోతే కావచ్చు. అవిటి కాళ్ళ నెపంతో యింట్లో పనీపాటా లేకుండా వుండవచ్చు, ఆకలి దప్పులకు ఒర్చుకోలేకపోవచ్చు. కానీ ఈ మాట అంటాడని కలలో కూడా వూహించలేకపోయింది. స్వయంగా పెళ్ళి చేసుకున్న మొగుడు అనవలసిన మాటేనా అది. రత్తికి వళ్ళంతా భగభగ మండినట్టయింది.

"ఏటి మావా..తాగనేదు కదా.. ఏటి మాట్టాడుతుండావ్" అన్నది నెమ్మదిగా తేరుకుని.

"అదేనే, అదేటి తప్పు కాదు. సుబ్బి ఆ పనే సేస్తా వుంది కాదే. నర్సిగాడికి తెలీకనే సేస్తా

వుందనుకున్నావా.. అదేం నేదు. ఏన్నీళ్ళకి సన్నీళ్ళు అంతే.. ఏరే మారగం లేనప్పుడు ఎవరు మాత్తరం ఏం సేత్తారే. ఆకలితో మాడి సత్తారా..నువ్వూ, నేనూ అయితే ఫరవానేదు. పసివాడు దేవుడెన్నాలుంటాడే గంజి నేకుండా - చౌదరిగారు కూడా నువ్వంటే..."

"మామా!" అరచింది రత్తి.

"కూణ్ణేకపోతే సత్తాం. అందరం గుడిసెలో కూకుని, గుడిసెకు నిప్పంటించేద్దాం. నాను ఆ పని మాత్రం సేయను మావా. కూణ్నేద్, కూణ్నేద్ అని ఎన్నాల్లేడుత్తాం. అంతా కలిసొకపాలే సద్దాం..."

"రత్తీ, అదేటే, ఈపాటిదానికే సత్తానంటావేటే - బతకడానికి కాదంటే మనం పుట్టింది. ఎట్టాగోట్టా బతకాలిగానీ సత్తాన్, సత్తాన్ అంటావేటె. అనసరానికి అదేటి తప్పు కాదే. అయన దగ్గరోపాలి ఎడితే పోయేదేటే..."

"ఛీ.. నీకు సిగ్గునేదు మామా.. నీకు తాగుడు మైకంలో నువ్వేం సెపుతుండావో నీ కర్థం కావటంనేదు. మళ్ళీ ఇంకోపాలి ఆ మాట అనకు. నాను బరించలేను..." చకచకా లోపలికి వెళ్ళిపోయింది రత్తి.

వెంకటయ్య ముఖం కోపంతో ఎర్రబడింది. తనలో తానే సణక్కున్నాడు. గుడిసె ప్రక్కనుంచి నర్సిగాడు తూలుకుంటూ పిచ్చి పిచ్చి పాటలు పాడుతూ వెడుతున్నాడు. తనకు మళ్ళీ వేళయించని తెలుసుకున్నాడు వెంకటయ్య. ఒకసారి ఖాళీ జేబు తడుముకుని మళ్ళీ సణుక్కున్నాడు.

గుడిసెలోనించి బయటకు సర్రున దూసుకు వచ్చింది రత్తి.

"మామా దేవుడికి వల్లు కాలిపోతా వుంది. కన్ను తెరవటం నేదు. వూరికే మూలుగుతుండాడు. నాకు భయంగా ఉండాది మామా" అన్నది.

"అదే పొద్దిలేయే!" వెంకటయ్య ఆరిపోతున్న బీడీని కొరికి తాపీగా ఆలోచిస్తూ అన్నాడు.

"అదికాదు మావా.. ఆడికేం బాగోనేదు. నాకేదో అనుమానంగా వుంది. డాట్టరు గారికి చూసించు మామా." అన్నది రత్తి కళ్ళ నీళ్ళు కమ్ముకురాగా.

వెంకటయ్య మదిలో చిత్తుగా త్రాగిన నర్సిగాడే మెదులు తున్నాడు.

"డాక్టరు కాడికెడితే డబ్బెవడిత్తాడే.. నీ అబ్బగాడా"

ఒక క్షణం ఆలోచించింది రత్తి. మెళ్ళో చూసుకుంది. మంగళసూత్రం తగిలింది. గబగబా తీసి "దీన్నమ్మితే డబ్బొత్తదిమామా దేవుడి కేలాగయినా పాణం పోయాల" అంది.

వెంకటయ్య నాలిక తడిచేసుకున్నాడు. అరుగు మీద నుంచి లేచాడు.

"అదిట్టాతే. మందు తెచ్చిత్తాను!" అన్నాను.

రత్తికి తెలుసు అతను ఏ మందు తెచ్చుకుంటాడో - అందుకే యివ్వలేదు. లోపలికి పరుగెత్తబోయింది. కుంటివాడు గనుక నడవటానికి వెంకటయ్య చేతుల్లో ఎప్పుడు రెండు కర్రలు వుంటాయ్. ఒక కర్రతో పారిపోబోయిన రత్తి నడుం మీద బలంగా బాదాడు.

"అమ్మో" అంటూ నేల కూలింది రత్తి.

వికటంగా నవ్వాడు వెంకటయ్య - "పొగరుబోతులా వుంది నాయాల అదేటియ్యే.." ఆమె చేతిలో నుంచి లాక్కోబోయాడు. ఆమె యివ్వలేదు.

"నాను దేవుడి మందే తెత్తాననంటినిగందే" అంటూ ఆమె నడుం మీద మరో దెబ్బ వేశాడు వెంకటయ్య.

అంతే! రత్తి మరి మాట్లాడలేదు. బాధగా కళ్ళు మూసుకుంది. ఒక్క క్షణం గుప్పెట విడవడింది. చటుక్కున మంగళసూత్రం అందుకుని, కుంటుకుంటూ వెళ్ళిపోయాడు అతను.

రత్తి నడుము మీద బాధ భరింపలేకపోయింది. సన్నగా మూలిగింది. అప్పుడే తన మూలుగుతో పాటు యింకో మూలుగు కూడా వినపడటం గ్రహించింది. బాధను దిగమ్రింగి చటుక్కున లేచింది. లోపలకు నడిచింది. దేవుడు బాధతో మూలుగుతున్నాడు. మెలికలు తిరిగిపోతున్నాడు. వాడి శరీరం మీద చేయి వేసి చూసింది. కాలిపోతున్నది. నోరు తెరిచాడు, ఆకలి వేస్తున్నదని చెప్పలేక చెప్పుతూ రత్తికి కాలుచేయి ఆడ లేదు. పసివాడు నాలుక బయటకు పెట్టాడు. తడి అందటం లేదు. గబగబా కుండలోని నీళ్ళను కొంచెం వాడి నోట్లో పోసింది రత్తి. నోరు మూసుకున్నాడు. కానీ మూలుగు ఆపలేదు. రత్తి మనస్సులోనే పిల్లవాడికి తగ్గితే ఏదో యిస్తానని దేవుడికి మొక్కుకుంది. ఎన్నిసార్లు నమస్కారాలు పెట్టిందో ఆమెకే తెలియదు. పిల్లవాడికేసి దీనంగా చూసింది. కళ్ళు మూసుకుని వున్నాడు. శ్వాస బరువుగా పీలుస్తున్నాడు.

రత్తికి దగ్గరలో అందుబాటులో వున్న డాక్టర్ ఒక్కడే. ఆయనింటికే పరుగెత్తింది. రత్తి అక్కడికి వెళ్ళిన సమయానికే ఆ యింటి ముందు ఒక కారు వచ్చి ఆగింది. అందులోనించి డాక్టర్ దిగాడు. డ్రయివింగ్ సీటులో వున్న ఆయన "నాకేదో భయంగా వుంది డాక్టర్ గారూ!" అన్నాడు.

డాక్టర్ చిన్నగా నవ్వాడు. "ఏం ఫరవాలేదురావుగారూ. ఆ నొప్పి కేవలం అజీర్తి వల్ల వచ్చిందే - రేపీపాటికి ఆవిడ తప్పకుండా లేచి తిరుగుతారు. మీరేమీ భయపడనవసరం లేదు."

ఆయన కోటు జేబులోంచి కొన్ని నోట్లు తీశాడు. డాక్టర్ చేతికి అందించాడు. - "నొప్పి తగ్గేదాకా, మా యింటికి ప్రొద్దున్నా, సాయంత్రం వచ్చి చూసిపోతూ వుండండి డాక్టర్ గారూ..కావాలంటే కారు పంపిస్తాను " అన్నాడు ఆయన.

డాక్టర్ డబ్బు జేబులో పెట్టుకుంటూ "అలాగే సార్!" అన్నాడు. కారు వెళ్ళిపోయింది.

లోపలికి వెళ్ళిపోతూ అప్పుడు చూశాడు డాక్టర్ రత్తిని.. ఎందుకువచ్చావ్ అన్నట్టుగా.

"మా పిల్లోడికి వళ్ళు కాలిపోతావుంది బాబూ. కళ్ళల్లో పానాలెట్టుకు పడుండాడు. రండి దొరా.. ఓసారి చూసి మందిచ్చారంటే చచ్చి మీ కడుపున పుడతాను దొరా..." అర్థించింది రత్తి.

డాక్టర్ చిన్నగా అదో రకంగా నవ్వాడు. "ఊ! మంచి పనే బాగుంది. ఇక్కడేం నేను

ఖాళీగా కూర్చోలేదు. వెళ్ళు వెళ్ళు" లోపలకి పోబోయాడు.

రత్తి డాక్టర్ కాళ్ళకి అడ్డంపడింది..."అట్టా అనకుదొరా.. ఆడు అన్నాయంగా సచ్చిపోతుండాడు. ఓసారి సూడు దొరా..." తెగ బ్రతిమిలాడుతున్నది రత్తి.

డాక్టర్ విసుక్కున్నాడు. "ఏమిటీగోల.. ధర్మాసుపత్రికి పోక ఎందుకిక్కడేడుస్తావ్?" అన్నాడు.

ధర్మాసుపత్రులు పేదవాళ్ళకి ఎంత అందుబాటులో వుంటున్నాయో ఎంత అదుకుంటున్నాయో ఆయనకు ఆ సమయంలో గుర్తు రాలేదు కాబోలు.

"ధరమాసుపత్రి మందు మూఁడ్రోజుల్నించి వాడుతున్నాం దొరా.. కానీ తగ్గనేదు. యింకా ఎక్కువయినాది. నాకేదో బయంగా వుండాది. నీకు దణ్ణం పెడతాను దొరా. ఓసారి అణ్ణి సూడు సామీ" ప్రార్థించింది.

డాక్టర్ విదిలించుకుని లోపలకు పోబోయాడు. అయినా రత్తి ప్రార్థన ఆగలేదు. చివరికి విసుక్కుంటూ అన్నాడు డాక్టర్, "పదిహేను రూపాయలు తీసుకురా చూస్తాను".

ఆయన వెనకనే తలుపు మూసుకుంది.

రత్తి బాధగా నిట్టూర్చింది. తర్వాత యింకా కొంతమంది డాక్టర్లను అడిగింది రత్తి. డబ్బులేందే ఎవరూ ముందుకు రాలేదు. పైకి మాత్రం తమకు ఖాళీ లేదని చెప్పి పంపించారు. తర్వాత డబ్బు కోసం కూడా ప్రయత్నించింది రత్తి. చివరకు వాడిన ముఖంతో ఇంట్లోకి అడుగుపెట్టింది.

బయట అరుగుమీద కూర్చుని తూలుతున్నాడు వెంకటయ్య. మైకంలో ఏదో పిచ్చిగా పాడుతున్నాడు కూడాను.

రత్తిని చూచి నవ్వాడు. "మందు - రత్తీ - మందు తెచ్చుకున్నానే" అన్నాడు అక్షరాలు ముద్దుగా వదులుతూ.

ఛీత్కారం చేసి లోపలికి నడిచింది రత్తి.

ఒక్క క్షణం ఏదో ఆలోచించింది. ఒక ధృఢ నిశ్చయానికి వచ్చింది. తనవేపే చూస్తున్న దేవుడి విగ్రహాన్ని వెనక్కు తిప్పింది. మానవుడికి సుఖాలలో వున్నప్పుడు దేవుడు గుర్తుకురాడు. కష్టాలు ప్రారంభంకాగానే మొదట గుర్తుకు వచ్చేది ఆ భగవంతుడే! కష్టాలు ఒక వారధి దాటాక. ఆభక్తి విరక్తిగా మారుతుంది. చివరకు అలా నాస్తికులయిన వాళ్ళూ వున్నారు. అదేనేమో మానవునిలోని బలహీనత.

రత్తి గబగబా కిరసనాయిలు బుడ్డి తీసి కిరసనాయిలు ఇంటికి కప్పిన తాటాకుల మీద పోసింది. అగ్గిపెట్టె కోసం తడుముకుంది.

సన్నగా మూలుగు వినపడింది. పసివాడు శ్వాస ఎగబీలుస్తున్నాడు. గబగబా దగ్గరకు వెళ్ళింది. పిల్లవాడు కళ్ళు విప్పాడు. దీనంగా, జాలిగా, అదోరకంగా చూశాడు తన కన్నతల్లిని. రత్తికి కడుపులో దేవినట్లయింది. పిల్లవాడి నుదురు మీద చేయి వేసింది. వేడి తగ్గలేదు. కానీ తీయని మమతల చల్లదనం - చల్లని మాతృప్రేమానురాగాల తియ్యదనం ఒకరి శరీరంలోనించి

యింకొకరి శరీరంలోకి పాకాయి. ఆ చిన్న హృదయంలో ఏం భావాలున్నాయె, ఏమో, పసివాడి పెదవులు ఏదో పలుకబోయి శక్తిలేక కదలలేదు. కానీ, కళ్ళల్లో మాత్రం నీళ్ళు నిలిచినయి. రత్తి ఒక్కసారిగా కదిలిపోయింది..భోరుమని ఏడ్చింది.

ప్రస్తుతం ఆమె జీవితం మీద పాము పడగ నీడ పడింది. అనుక్షణం ప్రమాద భరితమైన ఆ నీడలోనే తలదాచుకోవడమా? ఎదురు తిరిగి మొదటే పాము కాటుకి బలి కావడమా అన్నదే ఆమె సమస్య.

తను సుబ్బి దగ్గర నుంచి తెచ్చిన చీర కట్టుకుని పోడరు రాసుకుని తలవంచుకుని నెమ్మదిగా వచ్చిన రత్తిని చూసి బిత్తరపోయాడు వెంకటయ్య.

ఒక్క క్షణంలో తేరుకుని, పెద్దగా నవ్వాడు...

"గట్ట చేసినవ్ బాగుంది... నే సెప్పినప్పుడే నా మాటింటే బాగుండేది. దానికింతాలోచనేటే ఎర్రిదానా. నాకు తెలుసే - నువ్వొప్పుకుంటావని. ఆకలి బాధ గాదుటే యిది. ఎన్నాళ్ళని వుంటావిట్టా..." మళ్ళీ నవ్వాడు వెంకటయ్య. అంతకు క్రితమే పీకల దాకా పట్టించిన అమృతం రుచిని తల్చుకుంటూ.

రత్తి మాట్లాడలేదు. ఆమె తను ఎందుకు సిద్దపడిందో చెప్పే స్థితిలో లేదు. వెంకటయ్య కూడా ఆమె చెప్పినా అర్థంచేసుకునే స్థితిలో లేడు.

"పద మామా..తొందరగా వచ్చెయ్యాలిమల్లా!" అన్నది రత్తి కళ్ళల్లో నీళ్ళు యింకిపోగా.

"పదయే" అంటూ లేచాడు వెంకటయ్య. కర్రలను అందుకుని అడుగు ముందుకు వేశాడు.

"ఉండు మామా పిల్లగాడికి ఏదన్నా చీర కప్పి వస్తాను!" అంటూ లోపలకు వెళ్ళింది రత్తి.

వెంకటయ్య ఆగాడు.

ఒక్క నిముషం తర్వాత లోపల నుంచి పెద్ద గావుకేక వినిపడింది. మరుక్షణంలో రత్తి రాకెట్‌లా బయటకు వచ్చింది.

వెంకటయ్య ఆమె భీకరాకారాన్ని చూసి భయపడ్డాడు.

ఆమె వెంకటయ్యకు ఎదురుగా నుంచున్నది. ముఖంలో జీవం లేదు. కళ్ళల్లో రక్తపు జీరలు స్పష్టంగా కనిపిస్తున్నాయ్. పెదవులు వణుకుతున్నాయ్. ముక్కుపుటాలు అదురుతున్నాయ్.

"ఏటే..ఏటయిందే..ఆలీసం అయిపోతుండాది..మల్లా చౌదరిగారు..."

"మావా.." పెద్దగా అరచింది రనత్తి.

"నే రాను మామా..నేను రాను. యింక నేను రానే రాను!"

బిత్తరపోయి నుంచున్నాడు వెంకటయ్య.

ఉన్నట్టుండి పెద్దగా నవ్వింది రత్తి.

"సచ్చిపోనాడు మామా..దేవుడు సచ్చిపోనాడు" మళ్ళీ పెద్దగా అరచింది రత్తి.

✿